# నా యిల్లాలు

శ్రీ ఆలంపురం రాజుగారు, బి.ఏ.

నా యిల్లాలు పేరు జానకి. పచ్చగా పొడుగ్గా ఉంటుంది. అందమయినవాళ్లలోనే లెఖ. అందరితోపాటు సౌందర్యపోషణ అంటే శ్రద్ధే. సబ్బుబిళ్లతో ముఖమూ చేతులూ తోముకుంటుందిగాని మా ఓవర్సీరుగారి భార్యలా వారానికో సబ్బిళ్లా పక్షానికో స్నోబాటిలూ కావాలనదు. తెల్లనిచీరలూ, దళసరిజాకెట్లూ యిష్టంగాని లోపలిబాడీ పైకగపడేట్టు ఉల్లిపొరగుడ్డలు కట్టడం గిట్టదు. ఈమధ్య గజ్జలవడ్డాణం కావాలంది. 'ఓవర్సీరుగారు అప్పుచేసి భార్యా పోరుపడలేక వడ్డాణం చేయించాడు. నన్నుకూడా ఆపని చేయమంటావా' అన్నాను. ఆమె మర్లా మాట్లాడలేదు. మా కూతురు 'స్వతంత్ర' పుట్టకమునుపు కృత్రిమసాధనాలతో సంతాననిరోధం చేయాలని ప్రయత్నించాను. ఆలా చెయ్యడంవల్ల ఆలుమగలు మరికొన్నాళ్లు సుఖం అనుభవింపవచ్చుననీ, ఆడుదాని అందం చెడదనీ బోధించాను కాని నామాట పడనివ్వలేదు. స్త్రీలకు చిన్నవయస్సులోనే బిడ్డలు కలుగాలనీ, అలాఉండడం అందమనీ, కావలసిన పిల్లలు పుట్టినతర్వాత సంతాననిరోధం చేయాలనీ మా జానకి వాదం.

ఆడువారి ఆరోగ్యానికి గృహకృత్యాలు స్వయంగా చేసుకోవడం అవసరమని ఆమె అంటుంది. నిండుగర్భిణిగా ఉండీ తను పనిచేస్తుంది. అందుచేతనే ఆమెకు సుఖప్రసవము లభ్యమట. ఇంటిలో ఎంత వండినదీ నన్ను ఎప్పుడూ చూడనివ్వదు. చూస్తే నేను తక్కువతినడం, వెనుక వారికి మరికొంత మిగల్చడం కలుగుతుందట. మగవారితోపాటు యింటి ఆడువాండ్రుకూడా తింటే సంసారం ఆగదని ఆమె సిద్ధాంతం. మత్స్యమాంసములు తినదు. కాని కోడిగ్రుడ్లు తింటుంది. వీట్లలో స్థూలదృష్టికి కనుపడే ప్రాణంలేని కారణంచేత తినవచ్చునని సమాధానపర్చుకుంటుంది.

'కొర్రగింజంత కోడలుంటే అత్తకు కొండంత జ్వరం' అనే సామెత మాయింట వర్తించదు. మా అమ్మగారు కూతుర్ని కోడల్ని ఒకేవిధంగా చూస్తుంది. ఒకవేళ ఏదయినా తొందరపడి జానకి మాటలాడినా నేను కన్ను ఎర్రజేస్తాను. తక్షణం అత్తగార్కి నమస్కరించి తప్పు క్షమించమంటుంది. అంతటితో రాజీ పూర్తిఅవుతుంది.

నా యిల్లాలికి సంగీతం అంటే యిష్టం. వీణగాని, ఫిడేలుగాని పాడడంరాదు. హార్మోనియం అంటే గిట్టదు. హార్మోనియం హైందవసంగీతానికి సరిపడదనిన్నీ, సెలయేటిప్రవాహంలో కొట్టుకుపోయే పుడకలా, హార్మోనియంమీద పాటకు వ్యక్తిత్వ ముండదనిన్నీ ఆమె అభిప్రాయం. సినీమాలలో పాటలు విన్నా సంతోషమే. కాని మహాపతివ్రతల పాత్రలు కేవలము వ్యభిచారవృత్తిలోఉన్న స్త్రీలచేత ప్రదర్శింపబడుచున్నాయనీ, సినీమాలలోని కొన్ని ఘట్టాలవల్ల నిష్కళంకమగు కొందరి పతివ్రతల హృదయాలు చలిస్తున్నాయనీ చాలమంది యువకులు కన్యలు పతనము జెందుచున్నారనీ విషాదం.

జానకి సతీతులసివంటి మహాసాధ్వి కాదు. సతీతులసిలా ఉండడానికి యిష్టపడదుకూడాను. కాని మా ప్లీడరుగారి భార్యలా బజారులో భార్య చెప్పులు కొనుక్కోవడం, ఆమె చెప్పులు తనభర్త మోసుకురావడం సహించదు. భర్త చెప్పిందల్లా తూనా తప్పకుండా నమ్మవలెనని గాని, నడువవలెనని గాని ఒప్పుకోదు. భేదాభిప్రాయం ఉన్నప్పుడు యిద్దరూ వాదింపవచ్చును. ఒకరినొకరు సరిచేసుకోవచ్చును. ఆలుమగలిరువురు అసిస్టెంటుమాష్టరు, హెడ్

మాష్టరుఉన్న సంబంధంలో ఉండాలిగాని, బంట్రోతు హెడ్మాష్టారు ఉన్నట్టు ఉండకూడదు. ఆడుది స్వతంత్రించి ఉద్యోగంచెయ్యడం అంటే జానక్కి యిష్టం ఉండదు. మా గుమాస్తాపెళ్లాం మరోఊళ్లో మాష్టరీ చేస్తుందని విన్న రెండురోజులు జానకి నవ్వు ఆపుకోలేకపోయింది. పూర్వం సీత, దమయంతి, భర్తలను విడిచి ఒక్కనిమిషంఅయినా ఉండలేకపోవడం, యిప్పుడు కేవలం డబ్బుకోసం భార్యాభర్తలు వేర్వేరుచోట్ల ఉద్యోగులుగా ఉండటం కాల వైపరీత్య మంటుంది. కాని ప్లీడరుభార్య గుమాస్తాగా పనిచెయ్యడం, డాక్టరుభార్య కాంపౌండరుగా ఉండటం ఆక్షేపింపదు.

వార్తాపత్రికలు బల్లమీదఉంటే ఆమె బొమ్మలు చూచి మానేస్తుంది. బొమ్మలంటే జానకి చెవి కోసుకుంటుంది. కాని తన పడకగదిలోకూడా యూరపు దేశకన్యల దిగంబరచిత్రా లుండనివ్వదు అవి ఆల్బంలో ఉండవలసిందే కాని బయట ఉండతగవట. మొన్న మా పొరుగింటిదంపతులు ఫోటో తీయించుకున్నారు. భార్య కుర్చీమీద కూర్చుంది. భర్త నిలపడి ఉన్నాడు. అది భారతదేశమందలి పతివ్రత లక్షణం కాదనీ, పాశ్చాత్యలక్షణమనీ నిరసించింది. అప్పుడప్పుడూ 'గృహలక్ష్మి' పత్రిక చదువుతుంది. కాని కుప్పతిప్పలుగా ప్రకటనయ్యే 'నవ్వుపత్రిక'లను చూస్తే మండిపడుతుంది. వాటిని నవ్వుపత్రిక లనుటకు మారుగా 'రంగుపత్రిక'లనుట సరసమనిన్నీ వాటిని బహిష్కరింపకుండుట సంఘమందలి వేరు పురుగులను నశింపజేయకుండుటనిన్నీ అంటుంది.

జారత్వం అంటే జానకికి ఎంతమాత్రం గిట్టదు. ఈ విషయంలో ఆమె ఉద్దేశ్యం చమత్కారంగా ఉంది ఈరోజుల్లో మగవాడు తనభార్య అధ్యాత్మ. రామాయణకీర్తనలు పాడాలంటాడు పొరుగింటివాడి భార్య ఎంకిపాటలు పాడితే వినాలంటాడు. అలాంటివాళ్లకు యిలా సమాధానం చెప్పాలట 'మీరు భార్యనగు నన్ను విడిచి పరభార్యను పొందుతున్నారు. నాకు మీవల్ల సుఖంలేదు. కాబట్టి నేను ఎవరినో చూచుకుంటాను' అని ఖచ్చితంగా చెపితే నూటికి 90 కేసులు కుదురుతాయట.

వితంతువులకు ద్వితీయవివాహం చేయడం ఒప్పుకుంటుంది కాని పిల్లలున్న వితంతువులు పునర్వివాహం కోరడం ఏవగించుకుంటుంది. జానకి బయలుజేరిన రోజుల్లో మా హెడ్మాష్టరు భార్యలాగ తల దువ్వుకోక చీరవిడువక చెంబోక టుచ్చుకుని చెరువుగట్లమీద పెత్తనాలూ చెయ్యదు; కాలేజీలో చదువుకుంటున్న మా ప్లీడరుగారి కూతుర్లాగ బయటజేరిన రోజు లేవో యితరులకు తెలియకుండా ఉండేట్టు ప్రవర్తించదు. శుక్రవారపు నోము ఆమెకు మిక్కిలి యిష్టం. వ్రతసందర్భాల్లో ధనికులగు బ్రాహ్మలకు విలువగు దానాలుచేయక ఆడబ్బుతో వర్ణవివక్షత లేకుండా బీదలకు అన్నముపెట్టడం పుణ్యతర మంటుంది. ఈ కాలపు క్రైస్తవుల ఆరాధనమందిరాలు చాలాభాగం పెండ్లిబేరాల చావుళ్లుగా మారిపోతున్నాయని విషాదపడుతుంది.

మాకు స్వతంత్ర అనే కూతురుందని పైన వ్రాశాను. కట్నంఅడిగే అల్లునికి యీపిల్లను జానకి యివ్వదట. కట్నం అడుగకుండా పిల్లయే కావాలన్నవానికి ప్రేమపూర్తిగా పిల్లపై ఉన్నట్టు నిర్ధారణట. అప్పుడు నే నిలాఅన్నాను. 'అన్నిలక్షణాలు ఉన్న పిల్లవాడు మన స్వతంత్రను కట్నంమీద ఆశలేకుండా కావాలంటాడు. కాని వాని తల్లిదండ్రులు కట్నం యిస్తేనేకాని పెళ్లి జరుగనివ్వమంటారు. అప్పుడేం జేస్తావు?' అలాంటి సందర్భంలో యివ్వవచ్చునని జానకి తన అభిప్రాయం సంస్కరించుకుంది.

హెడ్మాష్టరింటికీ, ప్లీడరుగారింటికీ మధ్యలో ఉంది మాయిల్లు. మాయింట్లో హెడ్మాష్టరింట్లో ఉన్నన్ని ప్రాచీనపద్ధతులూ లేవు. ప్లీడరుగారింట్లో ఉన్నన్ని పాశ్చాత్యపద్ధతులూ లేవు.